

# యూరియా కొరతపై రైతుల ఆగ్రహం

**శెనార్తి మీడియా, మంచిర్యాల:**

యూరియా కొరతపై జిల్లాలో రైతులు ఆందోళనలకు దిగుతున్నారు. మంచిర్యాల జిల్లా కోటపల్లి రైతు వేదిక వద్ద రైతులు రాత్రి మూడుగంటల నుంచే క్యూలో నిల్చున్నారు. క్యూ లో ఉన్న వారికి యూరియా బస్తాలు దొరక్కపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల వ్యవసాయ అధికారి, మార్కెట్ సెక్రటరీ తమ బాధ్యతలు సక్రమంగా నిర్వర్తించకపోవడమే ఈ సమస్యకు కారణమని ఆరోపించారు. పైరవీకారుల సూచన మేరకే ఎరువులు పంపిణీ చేస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. మార్కెట్ సెక్రటరీ తన ఇష్టానుసారంగా యూరియా బస్తాలను ఇతరులకు మళ్లిస్తున్నాడని ఆరోపించారు. సమస్యలను అధికారులు పట్టించుకోవడం లేదని, ప్రభుత్వ విధానాల కారణంగానే ఇంతటి ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని, వెంటనే యూరియా కొరత నివారణకు చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

## జిల్లాలో వరదలతో భారీగా పంట నష్టం

**శెనార్తి మీడియా, మంచిర్యాల:**

జిల్లాలో కురిసిన వర్షాలు, వరదలతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వరి, పత్తి, కూరగాయలు, మిర్చి, మొక్కజొన్నతో పాటు పలు పంటలు నీట మునిగాయి. పంట పొలాల్లో మట్టి, ఇసుక పేరుకుపోవడంతో పెట్టుబడి పెట్టిన లక్షల రూపాయలు వృథా అయ్యాయని రైతులు వేదన వ్యక్తం చేస్తున్నారు. 16 వేల ఎకరాల్లో పంటలకు దెబ్బ మంచిర్యాల జిల్లాలోని 18 మండలాల్లోని 187 గ్రామా ల్లో పంటలు దెబ్బతిన్నాయి. వ్యవసాయ శాఖ ప్రాథమిక అంచనా ప్రకారం 9,319 మంది రైతులు నష్టపోయారు. మొత్తం 16,198.07 ఎకరాల్లో పంటలకు నష్టం జరిగినట్లు గుర్తించారు. ఇందులో 6,594 ఎకరాల్లో వరి, 9,501 ఎకరాల్లో పత్తి, 40 ఎకరాల్లో మిర్చి, 16 ఎకరాల్లో కూరగాయలు, 40 ఎకరాల్లో మొక్కజొన్న, ఒక ఎకరంలో మినుము పంటలు ఉన్నాయి.

**రైతులకు సాయం అందించనున్న ప్రభుత్వం**

వర్షాలు, వరదల కారణంగా పంట పొలాలను పరిశీలించిన అధికారులు ప్రాథమిక నివేదికలు సమర్పించారు. రైతులకు ఎకరాకు రూ.10 వేల చొప్పున సాయం అందించనున్నట్లు అధికారులు తెలిపారు.

# మంచిర్యాల కలెక్టరేట్‌లో ఉద్రిక్తత

- పింఛన్లు పెంచాలని ఎమ్మార్పీఎస్ నేతల ఆందోళన
- వినతిపత్రం ఇచ్చేందుకు చాంబర్ లోకి దూసుకుపోయిన నాయకులు
- సీసీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు

**శెనార్తి మీడియా, మంచిర్యాల :**



మంచిర్యాల జిల్లా నస్పూర్ సమీకృత కలెక్టరేట్‌లో సోమవారం ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్, వికలాంగుల హక్కుల పోరాట సమితి నాయకులు ఆందోళనకు దిగారు. దివ్యాంగులకు నెలకు రూ.6 వేల, వితంతువులు, ఒంటరి మహిళలకు రూ.4 వేల పెన్షన్ ఇవ్వాలని కోరుతూ నినాదాలు చేశారు. ప్రజావాణి కార్యక్రమం సందర్భంగా కలెక్టర్ అందుబాటులో లేరని అధికారులు చెప్పినా, నిరసనకారులు ఆగ్రహంతో గేట్లు దాటి బలవంతంగా కలెక్టర్ ఛాంబర్‌లోకి దూసుకెళ్లారు. దీంతో కలెక్టరేట్‌లో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో కొద్దిసేపు గందరగోళం సృష్టించిన నాయకులు చివరికి ఏవో రాజేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం పోలీసులు వారిని బయటికి పంపారు. ఈ ఘటనపై కలెక్టర్ సీసీ బొడ్డు రాయలింగు నస్పూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తాను విధుల్లో ఉండగా కొంత మంది నాయకులు దురుసుగా ప్రవర్తించి నెట్టివేస్తూ చాంబర్‌లోకి చొరబడ్డారని ఆయన ఆరోపించారు. ఈ ఫిర్యాదు ఆధారంగా నస్పూర్ ఎస్ఐ యు. ఉపేందర్ రావు కేసు నమోదు చేశారు. చెన్నూరి సమ్మయ్య, జిలకర శంకర్, జీడి సారంగం, లింగంపెల్లి శ్రీనివాస్, మంతెన మల్లేష్, గడ్డాల బనయ్యలపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగుతోందని మంచిర్యాల రూరల్ సీఐ ఏ. అశోక్ తెలిపారు. ఆందోళనలో ఎమ్మార్పీఎస్ జిల్లా ఇంచార్జీ లింగంపెల్లి శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు సమ్మయ్య మాదిగ, గద్దెల బానయ్య మాదిగ, చుంచు శంకర్ వర్మ, సుందిళ్ల మల్లేష్ మాదిగ, గొడిసెల దశరథం, చిప్పకుర్తి మల్లేష్, వీహెచ్‌పీఎస్ నాయకులు, వృద్ధులు, వికలాంగులు పాల్గొన్నారు.





## ప్రజావాణి దరఖాస్తులు పరిష్కరించాలి

**శెనార్తి మీడియా, మంచిర్యాల:** ప్రజావాణిలో అందిన ప్రతి దరఖాస్తును క్షేత్రస్థాయిలో పరిశీలించి, త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. సోమవారం నస్పూర్ సమీకృత జిల్లా కార్యాలయ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. చంద్రయ్య, తహసీల్దార్ శ్రీనివాస్ రావుతో కలిసి అర్జీదారుల నుండి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా పలువురు పౌరులు తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. తెలంగాణ ఎరుకల ప్రజా సమితి జిల్లా అధ్యక్షుడు ఉంద్రాల ఎల్లయ్య ఎస్సి, ఎస్టి మానిటరింగ్ కమిటీ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. చకినారపు సావిత్రి కులాంతర వివాహం చేసుకున్న తనకు చెన్నూరు అంగన్వాడిలో ఉద్యోగావకాశం ఇవ్వాలని కోరగా, బి. సమ్మయ్య తన కూతురు రెబ్బెన గురుకులంలో సీటు పొందిందని, ఆర్థిక ఇబ్బందుల కారణంగా మంచిర్యాలకు బదిలీ చేయాలని అభ్యర్థించారు. అలాగే, ఎంజాల కుమార్ తాళ్ల గురుజాల శివారులో ప్రభుత్వ భూమిని కొందరు ఆక్రమిస్తున్నారని, దాన్ని కాపాడాలని, సోగల చందు తన కుమారుడిని హాజీపూర్ మండలంలోని ముల్కల్ల రెసిడెన్షియల్ పాఠశాలకు బదిలీ చేయాలని కోరారు. సంధ్యవేణి తన కొనుగోలు భూమి నిషేధిత జాబితాలో చూపుతున్నందున తొలగించాలంటూ, ఆసంపల్లి చంద్రకళ తామిద్దరం దివ్యాంగులమని, రెండు పడక గదుల ఇండ్లకు అర్హులమని వినతి సమర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన ప్రతీ సమస్యను సంబంధిత శాఖల ద్వారా పరిశీలించి, తక్షణ చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. అనంతరం హెచ్ఐవి–ఎయిడ్స్‌పై రాష్ట్రస్థాయి క్విజ్ పోటీల్లో గెలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

**బోట్లకుంట చెరువు కబ్జాపై కలెక్టర్‌కు వినతి**



లక్షెట్టిపేట మండల కేంద్రంలోని బోట్లకుంట చెరువు పరిధిలోని ఇందిరమ్మ గద్దెను కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు అక్రమంగా ఆక్రమించారని బహుజన్ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ముల్కల్ల రాజేంద్రప్రసాద్ ఆరోపించారు. గంపలపల్లి చెరువు నుండి గొలుసు కట్టుతో బోట్లకుంట చెరువుకు సాగునీరు చేరుతుందని, అయితే ఇటీవల రియల్ ఎస్టేట్ వ్యాపారులు చెరువు మత్తడిని ధ్వంసం చేసి, ఇందిరమ్మ గద్దెతో పాటు సాగునీటి కాలువను కూడా కబ్జా చేసి విక్రయాలు ప్రారంభించారని తెలిపారు. ఈ అంశంపై జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించగా వారు సానుకూలంగా స్పందించినట్లు రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు నాగుల కిరణ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## క్విజ్‌లో కార్మెల్ విద్యార్థుల ప్రతిభ

**శెనార్తి మీడియా, మంచిర్యాల:** తెలంగాణ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్ర స్థాయి క్విజ్ పోటీలో మంచిర్యాల కార్మెల్ సీబీఎస్సీ స్కూల్ విద్యార్థులు రెండో బహుమతి సాధించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కుమార్ దీపక్ విద్యార్థులను అభినందించారు. విజేతలకు రూ. 8 వేల నగదు బహుమతితో పాటు ప్రశంస పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ అనిత, ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ సుధాకర్ నాయక్, మాస్ మీడియా అధికారి వెంకటేశ్వర్లు, దిశా సీపీఎం నీలిమ పాల్గొన్నారు. కార్మెల్ స్కూల్ జీవశాస్త్ర ఉపాధ్యాయురాలు హోలీ బాహ్, ప్రిన్సిపాల్ సిస్టర్ రెనెట్, అడ్మినిస్ట్రేటివ్ సిబ్బంది విద్యార్థులతో కలిసి హాజరయ్యారు.

# విద్యార్థుల భవిష్యత్తుకు ఉపాధ్యాయుడే మార్గదర్శి

**శెనార్తి మీడియా, మంచిర్యాల:**



విద్యార్థుల జీవితంలో ఉపాధ్యాయుడు మార్గదర్శిగా నిలిచి గుణాత్మక విద్యను అందించాలన్నారు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్. సోమవారం నస్పూర్ సమీకృత జిల్లా కార్యాలయంలో ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ఎదుగుదలలో ఉపాధ్యాయుల పాత్ర అపూర్వమని పేర్కొన్నారు. ప్రతి మనిషికి స్థిరాస్తి, ఆర్థిక వనరులు ఉపయోగపడతాయన్నా ఉన్నత విద్యతోనే సమగ్ర అభివృద్ధి సాధ్యమని తెలిపారు. ఉపాధి అవకాశాలను పెంచేందుకు తెలంగాణ ప్రభుత్వం అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్ల ద్వారా వృత్తి విద్యలో నైపుణ్యం పెంపొందిస్తున్నదని వివరించారు. 2047 నాటికి తెలంగాణ దేశంలో ముందంజలో నిలవాలంటే కఠోర శ్రమ, క్రమశిక్షణ, ఏకాగ్రతతో పనిచేయాలని సూచించారు. ప్రస్తుత విద్యా విధానంలో ఆధునిక సాంకేతికతకు ప్రాధాన్యతనిస్తూ మార్పులు జరుగుతున్నాయని చెప్పారు. మూడున్నర దశాబ్దాల పాటు సేవలందించే ఉపాధ్యాయులు ఒక పూర్తి తరాన్ని తీర్చిదిద్దుతారని, విద్యార్థులకు తల్లిదండ్రుల్లా మారి వారి భవిష్యత్తు నిర్మాణంలో కీలక పాత్ర వహించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందితే సమాజం, రాష్ట్రం, దేశం అభివృద్ధి సాధిస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు. త్రాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు, ప్రహరీ గోడలు వంటి మౌలిక వసతులతో పాటు మధ్యాహ్న భోజనంలో పోషకాహారాన్ని కల్పిస్తున్నామని వివరించారు. ఈ విద్యాసంవత్సరంలో జిల్లాలో 6 వేల మంది విద్యార్థులు అదనంగా చేరారని, బడిబాట కార్యక్రమం ద్వారా బడి మానిన పిల్లలను తిరిగి చేర్పించామని చెప్పారు. ముఖ గుర్తింపు ద్వారా హాజరు నమోదు విధానం వల్ల ఉపాధ్యాయుల సమయపాలన, విద్యార్థుల హాజరు మెరుగుపడిందని తెలిపారు. తరువాత రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైనవారిని సన్మానించి, జిల్లాలో 71 మంది ఉపాధ్యాయులకు పురస్కారాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. చంద్రయ్య, జిల్లా విద్యాధికారి ఎస్. యాదయ్యతో పాటు అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.





## బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా రఘునాథ్.. మంచిర్యాలలో సంబురాలు



**శెనార్తి మీడియా, మంచిర్యాల:**

బీజేపీ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మంచిర్యాల జిల్లా యువ నేత రఘునాథ్ వెరబెల్లి నియమితమైన సందర్భంగా జిల్లా కార్యాలయంలో సంబరాలు నిర్వహించబడ్డాయి. జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొని ఆహ్లాదంగా వేడుకను జరిపారు. ఈ సందర్భంలో నాయకులు మాట్లాడుతూ, రఘునాథ్ చేసిన సేవలను గుర్తించి పార్టీ ఆయనకు ఉన్నత స్థానం కల్పించిందని తెలిపారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో, 2028 అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన నాయకత్వంలో బీజేపీ బలాన్ని సాధిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో గాజుల ముకేశ్, పట్టి వెంకటకృష్ణ, జోగుల శ్రీదేవి, పబ్బతానేని కమలాకర్ రావు, వంగపల్లి వెంకటేశ్వర్ రావు, దుర్గం అశోక్, ఎనగందుల కృష్ణమూర్తి, బియ్యాల సతీష్ రావు, అమిరిశెట్టి రాజ్‌కుమార్, కుర్రే చక్రవర్తి, రంగా శ్రీశైలం, ముదాం మల్లేష్, మల్యాల శ్రీనివాస్, వైద్య శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## రెండేళ్లలో వందశాతం అక్షరాస్యత

**శెనార్తి మీడియా, మంచిర్యాల:** రాబోయే రెండేళ్లలో మంచిర్యాలను 100 శాతం అక్షరాస్యత జిల్లాగా తీర్చిదిద్దేందుకు సమిష్టిగా కృషి చేస్తామని జిల్లా వయోజన విద్యాధికారి ఎ. పురుషోత్తం నాయక్ తెలిపారు. అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం మందమర్రి మండల కేంద్రంలోని ప్రధాన మంత్రి శ్రీ మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలోని 31,435 మంది నిరక్షరాస్యులు, 3,013 మంది వాలంటీర్లను ఉల్లాస్ యాప్‌లో నమోదు చేసి శిక్షణ పూర్తి చేసినట్లు తెలిపారు. త్వరలోనే గ్రామాల్లో అక్షర కేంద్రాల ద్వారా వయోజనులకు చదువు నేర్పించనున్నట్లు వివరించారు. తరువాత విద్యార్థులకు ఉపన్యాస, వ్యాసరచన పోటీలు, సెర్ప్ సిబ్బందికి ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ రాజేశ్వర్, మండల విద్యాధికారి దత్తుమూర్తి, మోడల్ స్కూల్ ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ పెద్దన్న, లయన్స్ క్లబ్ జిల్లా అధ్యక్షులు సుదర్శన్, శ్రీనివాస్, ఎపిఎం శాంకరి, డిపిఎం జనార్ధన్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.






## కొండాపూర్ యాప వద్ద కొత్త రోడ్డు నిర్మించాలి

**శెనార్తి మీడియా, మంచిర్యాల:** మంచిర్యాల జిల్లా కాసిపేట మండలంలోని కొండాపూర్ చౌరస్తా (యాప) వద్ద కొత్త రోడ్డు నిర్మించాల్సిన అవసరం ఉందని మాది హక్కుల దండోరా సంఘం కాసిపేట అధ్యక్షుడు అటకపురం రమేష్ సోమవారం డిమాండ్ చేశారు. ఆయన అధ్వానంగా తయారైన రోడ్డుపై ప్లకార్డ్ పట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. రమేష్ తెలిపారు, రోడ్డు పూర్తిగా కుంగిపోయినప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని, వాహనదారులకు జరిమానాలు విధించే ప్రభుత్వం రోడ్ల సమస్యలను పట్టించుకోకపోవడం విచారకరమని అన్నారు. కొండాపూర్ యాప వద్ద నూతన రోడ్డు నిర్మాణానికి సీఎం రేవంత్ రెడ్డి తక్షణం చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

## బకాయిలను విడుదల చేయాలని కలెక్టర్ కు వినతి



**శెనార్తి మీడియా, మంచిర్యాల :**

బెస్ట్ అవైలబుల్ పాఠశాలల పెండింగ్ ఫీజు బకాయిలను విడుదల చేయాలని కలెక్టర్ కు పి డి ఎస్ యు విద్యార్థి సంఘం వినతి పత్రం అందజేసింది. ఈ సందర్భంగా పి డి ఎస్ యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి. శ్రీకాంత్ మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం ప్రవేట్ పాఠశాలల ద్వారా బెస్ట్ అవైలబుల్ స్కూల్ అడ్మిషన్లు కల్పించినప్పటికీ, మూడు సంవత్సరాలుగా అర కొర నిధులు మాత్రమే విడుదల చేయడంతో విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. బడ్జెట్ రాక కారణంగా పాఠశాలల నిర్వాహకులు విద్యార్థుల నుండి ఫీజులు వసూలు చేసే పరిస్థితి ఏర్పడిందని, దీంతో పేద విద్యార్థులు చదువుకు దూరమయ్యే ప్రమాదం ఉందని చెప్పారు. కాబట్టి ప్రభుత్వం తక్షణమే పెండింగ్ బకాయిలను విడుదల చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పి డి ఎస్ యు జిల్లా ఉపాధ్యక్షులు పి. సికిందర్, కే. కార్తీక్ పాల్గొన్నారు.